క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

వత్సవాయి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ చెన్నారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కొలుసు రమాదేవి అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభమతుందని మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని కోరారు.

100 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందజేత



చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని రెవ. జయపాల్ వితరణతో గురువారం గ్రామంలోని 100 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయపాల్ మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేద మహిళల్లో వితంతువులకు ఆరు నెలల పాటు కుట్టు శిక్షణనిచ్చి మిషన్లు అందించామన్నారు. శిక్షణను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలోజయపాల్ ట్రస్ట్ ప్రతినిధులు సందీప్, ఆశ, మన్మోహన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు 2వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

జగ్గయ్యపేట అర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం ఒకటో సచివాలయం పరిధిలోని 2వ వార్డు కాకానినగర్‌లో జరుగుతుందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్(బాజీ) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు వార్డులోని పాత గురుకుల పాఠశాలలోని సచివాలయం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

పేదలకు కడుపునిండా రాజన్న ఉచిత భోజనం



జగ్గయ్యపేట అర్బన్: పేదలకు కడుపు నిండా రాజన్న ఉచిత భోజనం క్యాంటిన్ ద్వారా భోజనాలు పెడుతున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక 30 వ వార్డు, వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన రాజన్న ఉచిత భోజన క్యాంటిన్‌లో గురువారం రెండో రోజు జరిగిన భోజనాల కార్యక్రమాన్ని విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను ప్రారంభించారు. రెండో రోజు సుమారు 500 మందికి పైగా భోజనం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీ ప్రసాద్, జిల్లా ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు మోరె వినోద్, కౌన్సిలర్ కొలగాని రాము, కంట్రాక్టర్ జీవీడీ ప్రసాద్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



కంచికచర్ల: కంచికచర్లకు చెందిన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో పాల్గొని అజూర్ ప్రాజెక్టును రూపొందించి జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ గురువారం తెలిపారు. అజూర్ అంతరిక్షం మానవాళి మనుగడకు ఏవిధంగా ఉపయోగపడుతోందో ప్రాజెక్టులో విద్యార్థులు వివరించారని పేర్కొన్నారు. ప్రాజెక్టులో పాల్గొన్న విద్యార్థులను ఆర్ఐ వినోద్ అభినందించారు. స్కూల్ డీన్ జాన్‌బాబు, నాసా ఇన్‌చార్జి పుష్పరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ఫిడే ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటర్‌నేషనల్ ఫిడే ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో తమ స్కూల్ విద్యార్థి ఉత్తమ రేటింగ్ సాధించారని శ్రీగౌతమ్ స్కూల్ డైరెక్టర్ నల్లాని సూర్యారావు పేర్కొన్నారు. గురువారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పి.తులసిఉత్తమ ప్రతిభ కనబర్చిన విజ్జి హేమంత్‌కుమార్‌ను అభినందించారు. నెల్లూరులో గత నెలలో జరిగిన ఫిడే ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో హేమంత్‌కుమార్ 1076 రేటింగ్ సాధించారన్నారు. హేమంత్‌కుమార్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించి నగర కీర్తి ప్రతిష్టలను మరింత పెంచేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చెస్ కోచ్ ఎ.రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో అగ్రస్థానం

'గడప గడప'లో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



అల్లూరులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అల్లూరు(వీరులపాడు): సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించటంలో మాత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకడుగు వేయడం లేదని తెలిపారు. మండలంలోని అల్లూరు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాదిరిగా కులమతాలు, పార్టీలు, రాజకీయాలతో ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు.

క్యాలెండర్ ప్రకటించి మరీ పథకాల అమలు..

దేశంలో ఎక్కడా లేని విధంగా ఏడాది పొడవునా ఏ నెలలో ఏ సంక్షేమ పథకం అందిస్తామనేది క్యాలెండర్ ద్వారా తేదీలను ప్రకటించి మరీ అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కొనియాడారు. అవినీతికి తావులేని పారదర్శక పాలన అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు పలకాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో సమస్యల పరిష్కారానికి కృషి

చందర్లపాడు(నందిగామ టౌన్): గడప గడపకు మన ప్రభుత్వంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. వెలదికొత్తపాలెం, కొడవటికల్లు గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

జగన్‌మోహనరావు మాట్లాడుతూ రెండు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తవడంతో సమస్యల పరిష్కారానికి సమావేశం నిర్వహించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో సచివాలయానికి రూ. 20 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. సమస్యలను గుర్తించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందలేదని పలువురు తమ దృష్టికి తీసుకువచ్చారని అటువంటి వాటిని గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి క్యూరూ ఆర్థికాభ్యున్నతి సాధించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అభివృద్ధి పనులను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయటంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు చింతోటి ప్రసాద్, రవిబాబు, శ్రీనివాస్, నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్
- మృతుని కుమారుల భవితకు భరోసా



చిన్నారుల వివరాలు తెలుసుకుని ధైర్యం చెబుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: కష్టకాలంలో నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడులో నిడముక్కల శ్రీనివాసరావు (38) మృతదేహాన్ని గురువారం ఆయన సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అరుణకుమార్ మాట్లాడుతూ శ్రీనివాసరావు వ్యవసాయ పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందడం బాధాకరమన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే కుటుంబం శ్రీనివాసరావు మృతితో పెద్దదిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని ఇద్దరు కుమారుల భవిష్యత్తును తాను చూసుకుంటానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. సొంత నిధుల నుంచి రూ. లక్ష ఆర్థిక సహకారాన్ని అందించనున్నట్లు ఎమ్మెల్సీ చెప్పారు. మృతి చెందారని చెబితే వచ్చి దండ వేసి వెళ్లే రాజకీయ నాయకులను చూశాం కానీ ఇటువంటి వారిని చూడలేదని పలువురు గ్రామస్తులు అంటున్నారు. కార్యక్రమంలో నాయకులు బొల్లినేని శ్రీనివాసరావు, పొరుపల్లి హరిబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ ప్రభాకర్



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ లావణ్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేస్తున్న సీడీపీవో

జగ్గయ్యపేట అర్బన్: పౌష్టికాహారంతో బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. స్థానిక 12వ సచివాలయం పరిధిలో గురువారం 25, 26 వార్డులకు సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రాల వద్ద తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర గర్భిణీ, బాలింతలకు జగనన్న సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. మహిళామూర్తులకు సంపూర్ణ పోషణ పథకం చక్కటి బహుమతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. పుట్టబోయే బిడ్డకు పౌష్టికాహారం, ఆరోగ్యం ఇవ్వడమే సీఎం ఆలోచన అని, భవిష్యత్‌లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు పాకలపాటి సుందరమ్మ, కర్ల శాంతకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): తల్లి పాలతోనే పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సర్పంచ్ గూడపాటి లావణ్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలను ఆరు నెలల పాటు ఇవ్వడం ద్వారా పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణిలు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ముచ్చింతాలలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కులూరి రాంబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మీ భార్గవి పేర్కొన్నారు. గ్రామంలోని పలు అంగనవాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను గురువారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ సంపూర్ణ పోషణ కిట్‌లతో నెలకు అందే రేషన్ సరుకులు అందిస్తారని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం



ద్వాక్రా సభ్యులకు పొట్టేళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మలక్‌బషీర్, సునీత తదితరులు

కంచికచర్ల: మహిళలు అన్నిరంగాల్లో ఆర్థికంగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అన్నారు. వెలుగు కార్యాలయంలో వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా మంజూరైన 33 యూనిట్ల గొర్రె పొట్టేళ్లను గురువారం డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మహిళా సాధికారతకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా డ్వాక్రా మహిళల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక డ్వాక్రా రుణాలను పూర్తిగా విడతల వారీగా మాఫీ చేశారన్నారు. మహిళల ఉన్నతికి ప్రభుత్వం పాడి గేదెలు, కోళ్లు, పొట్టేళ్లు పంపిణీ చేస్తోందని తెలిపారు. మండలంలో 33 మంది లబ్ధిదారులకు ఒక్కొక్క యూనిట్ రూ. 50వేల విలువైన పొట్టేళ్లను పంపిణీ చేశామని ఒక్కో యూనిట్ 87కేజీల చొప్పున 5 పొట్టేళ్ల పిల్లలు, మెడికల్ కిట్టు, 25 కేజీల దాణా పంపిణీ చేశామన్నారు. పంపిణీ చేసిన పొట్టేళ్ల పిల్లలకు ప్రభుత్వమే బీమా చేయిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, సర్పంచి వేల్పుల సునీత, నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, పరిటాల రాము తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు ట్రీ గార్డుల ఏర్పాటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ దేవీనగర్ నుంచి దావుబుచ్చయ్యకాలనీ వరకు బుడమేరు పక్కన ఇటీవల నాటిన మొక్కలకు గురువారం ఉద్యానవన శాఖ సిబ్బంది ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు స్థానికులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

నేడు బాబా మందిరంలో సంకట చతుర్థి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో శుక్రవారం సంకట చతుర్థిని పురస్కరించుకుని మందిరంలోని విజయ వినాయకునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదోష కాలంలో సంకట చతుర్థి రావటం విశేషమన్నారు. భక్తులు విజయ వినాయకుని దర్శించుకుని, పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

ఒంటరి మహిళలకు రేషన్ కార్డుల అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలో నివసిస్తున్న ఒంటరి మహిళలకు మంజూరైన రేషన్ కార్డులను స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా అందజేశారు. డివిజన్‌లోని వార్డు సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న ఒంటరి మహిళలకు మంజూరైన కార్డులను అందించామని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రభుత్వం ప్రజలకు మరింత చేరవైందని తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరిగా సర్టిఫికెట్ల కోసం ఆఫీస్‌ల చుట్టూ తిరిగి లంచాలు ఇచ్చే పని లేకుండా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అన్ని రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశామని చెప్పారు.

సామాజిక సేవల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలి



రోటరాక్ట్ క్లబ్ కార్యవర్గం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సామాజిక సేవల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి అన్నారు. ఆ కళాశాలలోని రోటరాక్ట్ క్లబ్ 14వ ఇన్స్టాలేషన్ ప్రోగ్రామ్ గురువారం సాయంత్రం కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణస్వామి మాట్లాడుతూ.. 100 ఏళ్ల చరిత్ర కలిగిన హిందూహైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో తమ కళాశాల కొనసాగుతుందన్నారు. విద్యా వ్యాప్తితో పాటుగా సామాజిక సేవా రంగాల్లోనూ తమ సంస్థలు ముందు వరుసలో ఉన్నాయని చెప్పారు. రోటరాక్ట్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.సాకేత్, ఉమామహేశ్వరిలు ఎన్నికయ్యారు. వారితో రోటరీ క్లబ్ నుంచి ప్రతినిధులుగా హాజరైన సాధు వీఆర్ ప్రసాద్, పార్థసారథి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు పి.నరేష్ పాల్గొన్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలరా హాస్పిటల్ ప్రాంతానికి చెందిన కట్టా నవ్యశ్రీదుర్గ 2019లో శ్రీనివాసమహల్ ప్రాంతానికి చెందిన శ్రీనును ప్రేమించి పెళ్లి చేసుకుంది.

వీరికి ఒక సంతానం. మార్బుల్ పని చేసే శ్రీను కొంత కాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను, పాపను పట్టించుకోవడం లేదు. కొద్ది రోజులుగా శ్రీను వాళ్ల అమ్మానాన్నలకు దగ్గరకు వెళ్లిపోయాడు. కాపురానికి ఇకపై రానని చెబుతూ భార్యను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సమగ్ర సమాచారం సేకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

నందిగామ టౌన్: బీఎల్వోలు విధిగా ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరించి యాప్‌లో పొందుపరచాలని ఆర్డీఓ రవీంద్రరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివరాల సేకరణ, యాప్‌లో పొందుపర్చటంలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కుబడిగా కాకుండా ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ముఖ్యంగా మృతుల ఓటర్లు తొలగించే సమయంలో మరణ ధ్రువీకరణ పత్రం పరిశీలించిన తర్వాతే తీసేయాలని సూచించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని వాటిని ఉల్లంఘిస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేటి తరానికి ఆదర్శం కాకాని వెంకటరత్నం



గ్రంథాలయానికి కూలర్ అందజేస్తున్న తరుణ్ కాకాని తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్ర్య సమరయోధుడు కాకాని వెంకటరత్నంను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని డెప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో వ్యవసాయ, పాడిపరిశ్రమ శాఖ మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం 123వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని, డెప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు కాకాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డెప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కృష్ణా జిల్లా ఆకునూరులో జన్మించిన కాకాని జిల్లా బోర్డు అధ్యక్షుడిగా, మూడు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. జై ఆంధ్ర ఉద్యమానికి మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. కాకాని వెంకటరత్నం జయంతిని పురస్కరించుకుని కాకాని ఆశయ సాధన అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ గ్రంథాలయానికి వాటర్ కూలర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.రవికుమార్, సర్వోదయ ట్రస్టు, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం సహాయ కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో తొలగించిన కాకాని విగ్రహాన్ని బెంజ్‌సర్కిల్ వద్ద ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సాధన సమితి కార్యదర్శి గుమ్మడి రామకృష్ణ, గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది జి.ఉమారాణి, వై.ధనలక్ష్మి, డి.రమేష్, కె.రాంబాబు, కుమార్ పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు, ఉద్యోగులు

పాయకాపురం(విజయవాడరూరల్): అవయవ దానంపై అవగాహన అవసరమని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. న్యూరాజీవ్ నగర్, పాయకాపురంలోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో గురువారం భారతీయ అవయవ దాన దినోత్సవం జరిగింది. వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఓపీడీ రోగులకు అవయవ దానం ప్రాముఖ్యతను వివరించారు. మనం మరణించిన తరువాత కూడా అవయవ దానం చేయడం ద్వారా సగటున తొమ్మిది మందికి జీవితాన్ని అందించవచ్చన్నారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎస్.సి.ఎస్.పి క్యాంప్ ద్వారా ప్రజలకు అవయవ దానం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వారితో, ఓపీడీ రోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమ అనుసంధానకర్త ఏజేవీ సాయి ప్రసాద్, సంస్థ అధికారులు, సిబ్బంది ఓపీడీ రోగులు పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

జి.కొండూరు: కుంటముక్కల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామారావు అదే పాఠశాలకు రూ.10వేలు విలువైన గ్యాస్‌పొయ్యి, పది కుర్చీలను వితరణగా ఇచ్చారు.

ఈ సామగ్రిని గ్రామ సర్పంచ్ వంగూరి కుమారి కెనడీ చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం షరీఫ్‌కు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించే దిశగా చర్యలు

పటమట(విజయవాడతూర్పు): నగర పరిధిలో రోజుకు 100 కుక్కలను పట్టుకోవాలని, ఆపరేషన్ యూనిట్‌లో యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ఆపరేషన్లు నిర్వహించాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆమె గురువారం వీధి కుక్కల సమస్య పరిష్కారానికి వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పెంపుడు కుక్కల యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పెంపుడు కుక్కలకు యాంటీరేబీస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) టీకాలు వేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ల వారీగా యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) గురించి మైక్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వీధి కుక్కల ప్రేమికులు, కాలనీ ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. హోటళ్లు, మాంసం విక్రేతలపై సక్రమంగా పారేయని వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి కుక్కల సమస్యలకు టోల్– ఫ్రీ నెంబర్ 1800 425 2000 వీఎంసీ, 81819 60909 వీఎంసీ వాట్సప్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఫ్లోర్ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, కార్పొరేటర్లు బీ జానారెడ్డి, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), పుష్పాల కుమారి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్, జంతు ప్రేమికులు, జీవకారుణ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం తెలంగాణ సిరిసిల్లకు చెందిన దాత సహకారంతో 500 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు పర్యవేక్షించారు.

నరసింహునికి కానుకల ఆదాయం రూ. 31.72 లక్షలు

వేదాద్రి(జగ్గయ్యపేట): యోగానంద లక్ష్మీ నరసింహస్వామికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల ఆదాయం రూ. 31.72 లక్షలు వచ్చిందని ఆలయ ఇన్‌చార్జ్ ఈవో జయప్రకాష్‌బాబు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో గురువారం హుండీలోని కానుకల లెక్కింపు జరిగింది. ఈ ఆదాయం నాలుగు నెలల ఆరు రోజులకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో నందిగామ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.